పేదల సంక్షేమానికి జగన్ కృషి





శాటిలైట్‌సిటీలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- ఉత్సాహంగా గడపగడపకూ..

కడియం: రాష్ట్రంలో పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. వేమగిరి పరిధిలోని రాజీవ్ నగర్‌లో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ ప్రతి గడపకూ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. నాలుగేళ్లలో వారికి అందించిన పథకాలను వివరించారు. నిరుపేద ముస్లిం తన ఇంటి మరమ్మతుకు సాయం చేయాలని, అందుకు రూ.50 వేలు ఖర్చు అవుతుందని కోరగా తాను రూ.లక్ష మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షకీలా బేగం, వైఎస్సార్ సీపీ నాయకులు నరాల గణపతి, కట్టా జమిందార్, బైరవరపు నాగేశ్వరరావు, పితాని శ్రీనివాసు, ఊటుకూరి శైలజ , కొత్తపల్లి శివాజీ, సాపిరెడ్డి సూరిబాబు ,నరాల శ్రీనివాసు, గ్రామ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న సురక్ష గ్రామసభను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. శుక్రవారం కాతేరు గ్రామసచివాలయం–1లో జరిగిన జగనన్నసురక్ష గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రత్నసాగర్, మాజీసర్పంచ్ ఆచంట వెంకట సుబ్బారాయుడు, సొసైటీ చైర్‌పర్సన్ ఆచంట కళ్యాణ్ పాల్గొన్నారు.

▸▸ శాటిలైట్‌సిటీ గ్రామ సచివాలయం –1లో జరిగిన గ్రామసభకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లాగిరిజన సంక్షేమాధికారి కేఎస్ జ్యోతి, తహసీల్దార్ పైడి చిన్నారావు, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌అండ్‌ఆర్డీ టి.కృష్ణ, ఏఎస్‌వో రామం పాల్గొన్నారు.

▸▸ హుకుంపేట గ్రామసచివాలయం–3లో మండల ప్రత్యేకాధికారి కేఎస్ జ్యోతి వివిధ ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.

రాష్ట్రంలో విద్య, వైద్యానికి పెద్దపీట

రాష్ట్రంలో విద్య, వైద్య సౌకర్యాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. కాతేరులో రూ.2.20 కోట్లతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవనానికి శుక్రవారం ఆయన కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వైద్యానికి ఈ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్లు వెన్నుదన్నుగా నిలుస్తాయన్నారు. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ పేరుతో ఇంటి వద్దకే వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆచంట వెంకట సుబ్బారాయుడు, ఆచంట కళ్యాణ్, యెజ్జు వాసు, కొత్తపల్లి నాగేశ్వరరావు, పెనుమాక సునీల్, మద్దా దుర్గారావు, చీకట్ల రంజిత్, బళ్లా సత్యనారాయణ, రొంగల వెంకటేశ్వరావు, హెల్త్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు పాల్గొన్నారు.



కాతేరులో పీహెచ్‌సీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న చందన నాగేశ్వర్

నేడు వైఎస్సార్ జయంతి

రాజమహేంద్రవరం సిటీ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తెలిపారు. ఎంపీ మార్గాని భరత్ రామ్, సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఆదేశాల మేరకు నగరంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: భాస్కర్ నగర్ ఫీడర్ లైన్ మరమ్మత్తుల నేపథ్యంలో నగరంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ మల్లికార్జున్ నగర్, భాస్కర్ నగర్, సుబ్రహ్మణ్యం నగర్, సువిశేషపురం, సీటీఆర్ఐ రోడ్డు, సెంట్రల్ జైల్‌క్వార్టర్లు, ఎఫ్‌సీఐ గోడౌన్స్, ఆర్టీఓ ఆఫీస్ రోడ్డు, సైక్లోన్ కాలనీ పుంత, ఎస్‌బీఐ కాలనీ, సుబ్బారావు పేట ఏరియాల్లో అంతరాయం కలుగుతుంది.

వ్యక్తి మృతదేహం లభ్యం

కంబాలచెరువు: స్థానిక పీవీ నర్సింహారావు పార్కు సమీపంలోని గోదావరిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని రెండో పట్టణ పోలీసులు శుక్రవారం కనుగొన్నారు. మృతుడికి సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయస్సు ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సద్వినియోగం చేసుకోండి

కంబాలచెరువు: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం అర్బన్ మండల విద్యాశాఖాధికారి 2 రమా రజని అన్నారు. స్థానిక నెహ్రూనగర్ స్కూల్ కాంప్లెక్స్‌లో శుక్రవారం జరిగిన ప్రాథమిక పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆమె పర్యవేక్షించారు.

మైనర్ల డ్రైవింగ్‌పై దృష్టి సారించండి



ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్

కంబాలచెరువు: మైనర్ల డ్రైవింగ్‌పై దృష్టి సారించాలని ఏలూర్ రేంజ్ డీఐజీ అశోక్ కుమార్ జిల్లా పోలసులను ఆదేశించారు. జిల్లా ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌ను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, ట్రాఫిక్ సిగ్నల్స్ పనితీరు, కౌన్సెలింగ్ సెంటర్, ఈ చలానా ఆఫీసు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వాహనాలు నడిపే మైనర్లు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు, ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ట్రాఫిక్ పోలీస్ అధికారులు అందరూ జిల్లాలోని కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎస్ ఆర్ రాజశేఖర్ రాజు, ఎం.రజనీ, డీఎస్పీ వెంకటేశ్వర్లు, కె.నాగమోహన్ రెడ్డి, జి.శంకర్ నాయక్ పాల్గొన్నారు.

సమష్టి కృషితో విజయ కేతనం



సిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: సమష్టిగా పనిచేసి, వచ్చే ఎన్నికల్లో సిటీలో వైఎస్సార్ సీపీ విజయపతాకం ఎగురవేద్దామని ఆ పార్టీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. దివాన్ చెరువులోని విజయభారతి చెస్ట్ ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం ఆయనను వైఎస్సార్ సీపీ శ్రేణులు కలిసి అభినందించాయి. ఈ సందర్భంగా గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడం ప్రస్తుతం మన ముందున్న లక్ష్యమన్నారు. సుశిక్షితులైన సైనికుల మాదిరిగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. ఎంపీ భరత్ రామ్ విజ్ఞప్తిపై సీఎం జగన్‌మోహన్ రెడ్డి తనను కోఆర్డినేటర్‌గా నియమించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు.

శాకంబరి అలంకరణలో అమ్మవార్లు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులో కొలువైన ఓనువులమ్మ తల్లి శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం శుక్రవారం కావడంతో అమ్మవారిని పలు రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరించారు. ఇలా చేయడం వల్ల పంటలు సుభిక్షంగా పండుతాయని ప్రజల నమ్మకం. ఆలయ అర్చకుడు సదాశివ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కడియం: కడియపులంక గ్రామదేవత పుంతలో ముసలమ్మ అమ్మవారిని శుక్రవారం సుమారు వెయ్యి కేజీల కూరగాయలు, పండ్లతో అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



శాకంబరిగా ఓనువులమ్మ, ముసలమ్మ తల్లి

క్రైస్తవులపై దాడులకు ఖండన

కడియం: మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన దాడులను ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ), క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఖండించింది. ఏఐసీసీ ప్రెసిడెంట్ బిషప్ జె.సోలోమెన్‌కు చెందిన పొట్టిలంకలోని జీసస్ ప్రేయర్ హౌస్ ప్రార్థనా మందిరంలో శుక్రవారం జిల్లా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన ఏఐసీసీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కె.మోజస్‌బాబు మాట్లాడుతూ మణిపూర్‌లో దాడులకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించి, బాధితులను రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. వీఎస్‌సీ ప్రసాద్, టాటావిక్టర్, పి.సుకుమార్, ఎం.కరుణాకర్, ఎం.ప్రసాద్, డి.పరంజ్యోతి పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌పై సమావేశం

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, అదనపు జిల్లా న్యాయమూర్తి, ఎం.నాగేశ్వరరావు, ఏసీబీ కోర్టు న్యాయమూర్తి యూయూ ప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ ఇన్స్యూరెన్స్ కంపెనీలతో శుక్రవారం ముందస్తు లోక్ అదాలత్ సమావేశం నిర్వహించారు. ఈనెల 22వ తేదీన జరగనున్న స్పెషల్ లోక్ అదాలత్‌లో మోటారు వాహనాల యాక్సిడెంట్ కేసుల పరిష్కారానికి సంబంధించి పిటీషనర్లు, ఇన్స్యూరెన్స్ సంస్థల అధికారులు, ఇరు పక్షాల న్యాయవాదుల మధ్య సమన్వయం కుదిర్చే విధంగా చర్చలు జరిగాయని న్యాయమూర్తి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి జంక్షన్ నామవరం రోడ్డులో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హుకుంపేట వరలక్ష్మీ కాలనీకి చెందిన (ప్రస్తుతం శాటిలైట్‌సిటీలో నివాసం) సుంకవల్లి వాసు (42) చికిత్స పొందుతూ మృతి చెందాడు. హోటల్‌లో సర్వర్‌గా పనిచేసే వాసు విధుల అనంతరం గురువారం అర్ధరాత్రి నామవరం రోడ్డులో ఆటో కోసం నిరీక్షిస్తున్నాడు. ఆ సమయంలో మోరంపూడి సాయినగర్ ప్రాంతానికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి తోట ప్రకాష్ వీఎల్ పురం నుంచి ఇంటికి వెళుతూ మోరంపూడి జంక్షన్ దాటిన తరువాత డివైడర్‌ను వేగంగా ఢీకొన్నాడు. కారు సుంకవల్లి వాసు, అక్కడే ఉన్న దుకాణంపైకి దూసుకుపోయి పల్టీలు కొట్టింది. ఆ ప్రమాదంలో తోట ప్రకాష్, సుంకవల్లి వాసుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో వాసు చికిత్స పొందుతూ మృతి చెందాడని బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఆర్. విజయకుమార్ తెలిపారు. తోట ప్రకాష్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు.



















